క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): మండలంలోని చమళ్లమూడిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గుంటూరుకు చెందిన శ్రీకృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ సీతారామస్వామి దేవాలయం వద్ద జరిగిన శిబిరానికి స్థానికుల నుంచి స్పందన లభించింది. వైద్యులు డాక్టర్ ముప్వ శ్రీనివాస్, డాక్టర్ నల్లపాటి శ్రీనివాస్ 85 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మాత్రల్ని పంపిణీ చేశారు.

కొత్తమల్లాయపాలెంలో అన్నదానం



కొత్తమల్లాయపాలెం (ప్రత్తిపాడు): మండలంలోని కొత్తమల్లాయపాలెంలో ఆదివారం అన్నదానాన్ని నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా రెండు రోజుల కిందట సీతారాముల కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక దేవాలయం వద్ద అన్నదానాన్ని చేపట్టారు. అధిక సంఖ్యలో హాజరైన మహిళలు, భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానంలో పాల్గొని స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు.

విద్యార్థులకు పెన్నుల పంపిణీ



పెదనందిపాడు: స్థానిక సాయి మందిర్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. పరీక్షలు బాగా రాయాలని కమిటీ సభ్యులు, దాతలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అర్వపల్లి కృష్ణమూర్తి, అర్వపల్లి రామసుబ్బారావు, తడవర్తి సురేష్‌బాబు, ముద్దన రాఘవయ్య, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



చేబ్రోలు: పొన్నూరు పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద ఆదివారం ఉదయం గుర్తు తెలియని వృద్ధుడు మరణించాడు. వయస్సు అరవై సంవత్సరాలు ఉంటుంది. వృద్ధుడి వివరాలు తెలియాల్సి ఉంది. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరాశ్రయులకు అన్నదానం



పెదకాకాని: హెల్పింగ్ సోల్జర్స్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం పోలీస్ స్టేషన్, తోట, పెద కాకాని సెంటర్, నంబూరు అడ్డరోడ్డుతో పాటు పలుచోట్ల 200 మంది నిరాశ్రయులకు అన్నదానం నిర్వహించారు. గతంలోనూ ట్రస్ట్ సభ్యులు పలు సేవా కార్యక్రమాల్ని నిర్వహించారు. కరోనా వైరస్‌తో మరణించిన వారికి అన్నీ తామై అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకుడు షేక్ జబీబుల్లా, మిత్రులు పాల్గొన్నారు.

భారతీనగర్ సొసైటీ అధ్యక్షుడు యతిరాజులు మృతి

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు మండలం ఉప్పరపాలెంలోని భారతీనగర్ సొసైటీ అధ్యక్షుడు తాడిశెట్టి యతిరాజులు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. పొన్నూరు పట్టణంలోని శాంతీనగర్‌లో యతిరాజులు నివాసానికి ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య వెళ్లి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట మార్కెట్టు యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, దాసరి నారాయణరావు, బొద్దులూరి రంగారావు ఉన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం
- అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు
- కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు
- పరీక్షలకు సన్నద్ధమైన విద్యార్థులు



ప్రత్తిపాడులోని పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన తాగునీరు



ప్రత్తిపాడులోని పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన బెంచీలు

ప్రత్తిపాడు: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలోని ప్రత్తిపాడు బీవీఆర్ జెడ్పీ హైస్కూలు, చినకోండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీనివాస హైస్కూళ్లలో పరీక్షలు జరగనున్నాయి. కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటు ఆఫీసర్లు ముందస్తు చర్యలు తీసుకున్నారు. సౌకర్యవంతంగా పరీక్షలు రాసేందుకు వీలుగా అన్ని కేంద్రాల్లో బెంచీలతో పాటు రక్షిత మంచినీటి కుండలను ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లను శుభ్రం చేయించారు.

సీఎస్‌లు, డీవోలు వీరే..

పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ (డీవో)లను ఉన్నతాధికారులు నియమించారు. ప్రత్తిపాడు బీవీఆర్ జెడ్పీ హైస్కూలులోని పరీక్ష కేంద్రానికి సీఎస్‌గా ఎం. ఆంజనేయులు (పుసులూరు జెడ్పీ స్కూలు)ను, డీవోగా బి. చంద్రశేఖర్ (అన్నపర్రు జెడ్పీ స్కూలు)ను, శ్రీనివాస హైస్కూలు పరీక్ష పరీక్ష కేంద్రానికి సీఎస్‌గా టి. మాధవి (ఉప్పలపాడు జెడ్పీ స్కూలు), డీవోగా ఎన్. రామకృష్ణ (అన్నపర్రు జెడ్పీ స్కూలు), చినకోండ్రుపాడు పరీక్ష కేంద్రానికి సీఎస్‌గా కె.వి.ఎల్. నరసింహారావు (తిక్కిరెడ్డిపాలెం హైస్కూలు), డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా ఎల్. రామారావు (కొప్పర్రు హైస్కూలు)ను జిల్లా ఉన్నతాధికారులు నియమించినట్లు మండల విద్యాశాఖ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రత్తిపాడు కేంద్రంలో 220 మంది, శ్రీనివాస హైస్కూలు కేంద్రంలో 158 మంది, చినకోండ్రుపాడు కేంద్రంలో 254 మంది పరీక్షలు రాయనున్నారు.

పెదకాకానిలో..

మండలంలో గతంలో వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు పాఠశాలల్లో మాత్రమే పదవ తరగతి పరీక్షలు నిర్వహించేవారు. ఈ ఏడాది అదనంగా కొప్పురావూరు, ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలల్లోనూ నిర్వహించేందుకు అనుమతులు ఇచ్చారు. మండలంలోని ఏడు జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి 646 మంది, ఐదు ప్రైవేటు పాఠశాలల నుంచి 216 మంది కలుపుకొని మొత్తం 862 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఐదు పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు, వసతులు కల్పించినట్లు ఎంఈఓ డి. బలిరాం తెలిపారు.

కాకుమానులో..

మండలంలోని కాకుమాను, చినలింగాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్ఐ ఎస్.రవీంద్ర తెలిపారు. ఆయా సెంటర్ల వద్ద ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు

144 సెక్షన్ అమలు

పరీక్ష కేంద్రాలకు రెండు వందల మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో గుంపులుగా ఉండకూడదు. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు విషయాన్ని గమనించి సహకరించాలి. ఎవ్వరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యల్ని తీసుకుంటాం.

–డి. రవీంద్రబాబు (ఎస్ఐ, ప్రత్తిపాడు)

జిరాక్స్ సెంటర్లు మూసివేయాలి

ఉదయం 8.30 గంటల కల్లా విద్యారులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలి. నిర్ణీత సమయం వరకే లోపలకు అనుమతిస్తారు. ఉదయం పరీక్షలు ప్రారంభమైన నుంచి ముగిసే వరకు గ్రామంలోని జిరాక్స్ సెంటర్లు కచ్చితంగా మూసి వేయాలి. కేంద్రాల వద్ద హెల్త్, పోలీస్, రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారు.

–సీహెచ్. రమాదేవి (ఎంఈవో)

మిరప రైతు 'పంట పండింది'

- ఆశాజనకంగా ధరలు
- క్వింటా రూ. 16 వేల నుంచి రూ. 20 వేల వరకు కొనుగోలు
- రైతుల్లో ఆనందం



వెనిగండ్ల పొలాల్లో విరగ్గాసిన మిరప చేను



కల్లాల్లో ఎండుతున్న మిరప కాయలు

పెదకాకాని: మిరప దిగుబడితో పాటు ధరలు కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతులు లాభాల బాటలో పయనిస్తున్నారు. తొలి కోతలో తాలు కాయల రాశులు పెరిగి భయపెట్టినప్పటికీ రాను రానూ నాణ్యతతో పెరగడంతో ధరలు నిలకడగా ఉన్నాయి. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు, వెనిగండ్ల, పెదకాకాని, తక్కెళ్లపాడు, రామచంద్రపాలెం గ్రామాల్లో రైతులు మిరప సాగు చేపట్టారు. ఆయా గ్రామాల్లో సుమారు 400 ఎకరాల్లో పంట సాగు అవుతుంది.

హైబ్రీడ్ రకాలపై రైతుల మొగ్గు

మిరప పంట సాగు అనగానే ముందుగా రైతులకు గుర్తుకు వచ్చేది అధిక పెట్టుబడులు. పొలంలో విత్తనం నాటిన దగ్గర నుంచి ఎరువులు, పురుగు మందులు, నీటి తడుల రూపంలో అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టాలి. ఎకరానికి రూ. 2 లక్షల దాకా ఖర్చు చేయాలి. ఇటీవల సాధారణ రకాలు తెగుళ్లను తట్టుకోలేక దిగుబడి తగ్గి రైతులు నష్టాలను చవి చూస్తున్నారు. దీంతో ఈ ఏడాది ఎక్కువగా ఆర్మూరు, 275, 279, బులెట్, రోమి 2626, డీజో 355 వంటి హైబ్రీడ్ రకాలు సాగు చేశారు.

తాలు కాయలతో తొలుత నిరాశ

వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా మొదటి రెండు కోతల్లో తాలు కాయలతో పాటు తామర పురుగు ఎక్కువ కావడంతో రైతులు కొంత నిరాశ చెందారు. అధిక మొత్తంలో పురుగు మందులు కూడా పిచికారీ చేశారు. అయితే, ఇటీవల తాలు శాతం తగ్గడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఎకరానికి 20 క్వింటాలు నుంచి 30 క్వింటాలు వరకూ దిగుబడి వస్తోంది. మార్కెట్‌లోనూ నాణ్యత బట్టి క్వింటా(100 కిలోలు) రూ. 20 వేల నుంచి రూ. 25 వేల వరకూ కొనుగోలు చేస్తున్నారు. బ్యాడిగి రకాన్ని కల్లాల్లోనే రూ. 30 వేలకు పైనే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రైతులకు సరుకు రవాణా, వ్యాపారులకు కమిషన్ వంటివి చెల్లించాల్సిన అవసరం తప్పింది. తాలు కాయలు కూడా నాణ్యత ఆధారంగా క్వింటా రూ. 8 వేల నుంచి రూ.14 వేల వరకూ పలుకుతుండటంతో రైతుల పంట పండింది.

హాస్టల్ అభివృద్ధికి ఆర్థిక సహకారం

రాజ్యసభ మాజీ సభ్యుడు సుజనా చౌదరి



బసవపున్నయ్యను గజమాలతో సత్కరిస్తున్న సుజనా చౌదరి, కృష్ణప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజహితం, అభివృద్ధి కోరుకునేవారు కమ్మవారని రాజ్యసభ మాజీ సభ్యుడు యలమంచిలి సుజనా చౌదరి పేర్కొన్నారు. అరండల్‌పేట 4వ లైనులోని కమ్మ బాలుర వసతి శతాబ్ది ఉత్సవాల్ని ఆదివారం నిర్వహించారు. హాస్టల్ పాలకమండలి అధ్యక్షుడు డాక్టర్ కొండబోలు బసవ పున్నయ్య అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుజనాచౌదరి మాట్లాడుతూ వందేళ్ల కిందట దాతల సహకారంతో ప్రారంభించిన వసతి గృహం వేలాది మంది ఆకలి తీర్చిందని తెలిపారు. ఎందరో విద్యావంతులుగా ఎదిగి దేశ, విదేశాల్లో ప్రముఖులుగా రాణించారని పేర్కొన్నారు. హాస్టల్ అభివృద్ధికి పదేళ్ల పాటు ప్రతి ఏడాది రూ.ఐదు లక్షల్ని సుజనా ఫౌండేషన్ ద్వారా అందిస్తామని చెప్పారు. విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, డైనింగ్ హాలు, ఏసీ వసతులు కల్పించడంలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఇంటర్మీడియట్ బైపీసీ విద్యార్థుల్లో ఏటా ఒకరికి తమ మెడికల్ కళాశాలలో ఉచిత సీటును కేటాయిస్తామని తెలియజేశారు. దాతలు అందిస్తున్న సహకారంతో విద్యార్థులు నచ్చిన రంగంలో ఉన్నతంగా రాణించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం తమ బాధ్యతగా అందిస్తున్న చేయూత అభినందనీయమని చెప్పారు. విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యతలు చాలా అవసరమన్నారు. కమ్మ విద్యార్థులు సమాజానికి మార్గదర్శకంగా ఉండాలని హితవు పలికారు. హాస్టల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రొఫెసర్ యలవర్తి నాయుడమ్మ, మోటూరి హనుమంతరావు, సినీ నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ యడ్లపాటి వెంకట్రావు సహా అనేకమంది వసతి గృహంలో చదువుకుని ఆయా రంగాల్లో ప్రముఖులుగా వెలుగొందారని చెప్పారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏడాది పాటు విద్యార్థులతో పర్యావరణం, ఆరోగ్య, సేవ కార్యక్రమాల్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. శతాబ్ది ఉత్సవాల వెబ్‌సైట్‌ను సుజనాచౌదరి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు మద్దినేని గోపాలకష్ణయ్య, రాయపాటి శ్రీనివాస్, యలమంచిలి శివాజీ, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాదల రత్నగిరి బాబు, డాక్టర్ పాపినేని శివశంకర్, కార్యదర్శి మండలపు బంగారు బాబు, సహాయ కార్యదర్శి కొరప్రాటి రామారావు, కోశాధికారి బొల్లెపల్లి శ్రీనివాసరావు, పంచుమర్తి సుశీల, పలువురు పూర్వ విద్యార్థులు, నగర ప్రముఖులు,పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు

సరస్వతీ మాత విగ్రహాల ఆవిష్కరణ



సరస్వతీ మాత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే ముస్తఫా

నెహ్రూనగర్: వాసవీ మణికంఠ గుంటూరు సభ్యులు నగరపాలక సంస్థ పాఠశాలల్లో చదువుల తల్లి సరస్వతీ మాత విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. జలగం రామారావు మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలు, కావటి శంకరరావు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలులో ఆదివారం వాసవీ మణికంఠ గుంటూరు సభ్యులు ఏర్పాటు చేసిన విగ్రహాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవీ మణికంఠ గుంటూరు, మహిళా శక్తి గుంటూరు సభ్యులు నగరంలో ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని, భవిష్యత్‌లో మరిన్ని ప్రజోపయోగకరమైన పనులు నిర్వహించాలని ఆకాంక్షించారు. వాసవీ మణికంఠ గుంటూరు సభ్యులు గోనుగుంట్ల జయంత్ కుమార్, గిరిజా శాంత ప్రసాద్, బోలిశెట్టి వెంకటేశ్వరరావు, జుజ్జూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంకిరెడ్డిపాలెం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

గుంటూరు రూరల్: అంకిరెడ్డిపాలెం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోనే అభివృద్ధి సహిత.. ఆహ్లాదభరిత.. ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన పక్కా ప్రణాళికలతో పనులు జరుగుతున్నట్లు ఆయన చెప్పారు. ఆదివారం 26వ డివిజన్‌లోని అంకిరెడ్డిపాలెం గ్రామంలో శ్మశానవాటిక, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్, బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణ పనుల్ని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బి.రాజశేఖరరెడ్డి, కార్పొరేషన్ అధికారులు, స్థానిక పెద్దలతో కలసి ఎమ్మెల్సీ పరిశీలించారు. అన్ని వసతులతో పాటు గ్రీనరీకి కూడా అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పూర్తి సుందరీకరణతో అందమైన పూదోటలా శ్మశానవాటికను తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ఆకర్షణగా చెరువు మధ్యలో జాతీయ పతాకం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చెరువులోకి వచ్చే నీటిని ముందే శుద్ధి చేసే పంపే ఏర్పాటు కూడా చేస్తున్నట్లు చెప్పారు. అంకిరెడ్డిపాలెం గ్రామ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చి వేసే ఈ బృహత్తర కార్యక్రమం సజావుగా జరిగేందుకు, పూర్తయిన తర్వాత నిర్వహణకు గ్రామ పెద్దలతో ఒక కమిటీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి, చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ దిగుమతి సంఘం అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి, మాజీ అధ్యక్షుడు కుర్ర సాంబిరెడ్డి, స్థానిక నేతలు పుల్లారెడ్డి, సంజీవరెడ్డి, గంగాధరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కిశోర్‌రెడ్డి, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), కార్పొరేషన్‌ఈఈలు కొండారెడ్డి, సుందరరామిరెడ్డి, డీఈ కల్యాణరావు, ఏఈ రవి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం ఆరాధన



ముట్లూరు పునీతశౌరి పుణ్యక్షేత్రంలో విశ్వాసుల ప్రార్థనలు



కాకుమానులో వేడుకలు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం ముట్లూరులోని పునీతశౌరి పుణ్యక్షేత్రంలో ఫాదర్ మార్నేని జోసఫ్ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఆరాధన వేడుకలు ఘనంగా జరిగాయి. దావీదు కుమారునికి జయము అన్న నినాదంతో సంఘ పెద్దలు, సంఘస్తులు, విద్యార్థులతో కలసి ప్రదర్శనలు, ర్యాలీలను నిర్వహించారు. ఏసుక్రీస్తు యెరూషలేము పట్టణములో ప్రవేశించిన సమయంలో అక్కడి జనులు రారాజును కనుగొని జయజయధ్వానాలతో, కీర్తనలతో మహిమ పరుస్తూ దావీదు తనయా హోసన్నా..యూదుల రాజా హోసన్నా అంటూ ఘనంగా స్వాగతించారని గుర్తు చేశారు. దైవ కుమారుడు తగ్గించుకుని గాడిద మీద ఊరేగాడని, ఇది ఎంతో ప్రాముఖ్యమైనదని, ఆ తరువాతనే సిలువ వేసినారని చెప్పారు. గ్రామ ప్రజలంతా క్షేమంగా ఉండాలని మరణానికి ఎదురెళ్లిన మహోన్నతుడని స్తుతించారు.

పాపుల రక్షణ కోసమే శిలువపై క్రీస్తు మరణం

పెదనందిపాడు: పాపుల రక్షణ కోసమే క్రీస్తు శిలువపై మరణించాడని ఫాదర్ జాన్ కెనడీ తెలిపారు. మట్టల ఆదివారం సందర్భంగా గ్రామాల్లోని చిన్నారులు ఉదయాన్నే ఈత మట్టలకు రకరకాల పూలను అలంకరించుకుని, వీధుల్లో క్రీస్తు నామస్మరణ చేస్తూ తిరిగారు. ఈ సందర్భంగా ఫాదర్ జాన్ కెనడీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏసు క్రీస్తును నమ్ముకుని ప్రార్థన చేసినప్పుడే పాపాల నుంచి విముక్తి పొందుతారని తెలిపారు.

కాకుమానులో...

మండలంలోని గ్రామాల్లో ఆదివారం మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే చిన్నారులు ఈత మట్టలకు వివిధ రకాల రంగు రంగుల పూలను ఏర్పాటు చేసుకుని గ్రామ పురవీధుల్లో క్రీస్తు నినాదాలు చేస్తూ పర్యటించారు. అనంతరం స్థానిక ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ పరిశుద్ధ దేవాలయంలో పాస్టర్ ప్రభువైన ఏసుక్రీస్తు పుట్టుక, మరణం గురించి వాక్యోపదేశం చేశారు. గత 35 రోజుల నుంచి ఉపవాస ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు రానున్న శుభ శుక్రవారంతో ఉపవాసాలు ముగించనున్నారు.



వరగానిలో చిన్నారుల ప్రదర్శన

చేబ్రోలులో..

ఈస్టర్ పురస్కరించుకొని క్రీస్తు శత వార్షిక లూథరన్ దేవాలయం ఆధ్వర్యంలో ఆదివారం మట్టల ఆదివారం పండగను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ కనపర్తి ఆశీర్వాదం ఆధ్వర్యంలో సండే స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు పూలతో అలంకరించిన మట్టలతో చర్చి ప్రాంగణం నుంచి అంబేద్కర్ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు.

■ వడ్లమూడి, శేకూరు, నారాకోడూరు గ్రామాల్లో మట్టల ఆదివారం పండగను ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు అందరి పాపాల్ని ప్రక్షాళన చేసే నిమిత్తం తన రక్తాన్ని చిందించారని పాస్టర్లు తెలిపారు. కార్యక్రమాల్లో చిన్నారులు, సంఘస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలి



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ, చిన్న సమస్య వచ్చినా వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ పృథ్వీ కృష్ణ తెలిపారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఆదివారం విజయశ్రీ క్లినిక్ ఆధ్వర్యంలో 47వ డివిజన్ గోరంట్ల తూర్పు బజారు కమ్యూనిటీ హాలులో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని డివిజన్ వైఎస్సార్ సీపీ ఇంచార్జి జల్లేపల్లి వేణుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రస్తుత పోటీ ప్రపంచంలో అశ్రద్ధ వల్ల చిన్నపాటి రోగాలు కూడా దీర్ఘకాలిక వ్యాధులుగా మారుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరంలో 1500 మందికి పైగా బీపీ, షుగర్, రక్త పరీక్షలు, జ్వరాలు, దీర్ఘకాలిక వ్యాధులు, నొప్పులు తదితర వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అర్హులైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

నేడు డీఎస్సీ కోరుతూ ధర్నా

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల్ని భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా డీఈవో కార్యాలయాల వద్ద ధర్నా చేపడుతున్నట్లు డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, టీచర్ అభ్యర్థులు పాల్గొనాలని ఆయన కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెదకాకాని: శంకర కంటి ఆసుపత్రికి వచ్చి వ్యక్తి అదృశ్యమైన సంఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా దర్శి మండలానికి చెందిన వెన్నపూస సుబ్బారెడ్డి మార్చి 26న శంకర కంటి ఆసుపత్రి నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి వచ్చాడు. శుక్లాల ఆపరేషన్ చేయించుకునేందుకు మార్చి 28న ఆసుపత్రి ఏర్పాటు చేసిన బస్సులో గ్రామస్తులతో కలసి పెదకాకాని శంకర కంటి ఆసుపత్రికి చేరుకున్నాడు. ఆ తరువాత ఆసుపత్రి వారు వైద్య పరీక్షలు చేస్తున్న సమయంలో అక్కడి నుంచి వెళ్లి పోయాడు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో బంధువులు ఎంత వెతికినా కనిపించలేదు. సుబ్బారెడ్డి అల్లుడు బాగిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

సాయిబాబా మందిరం వార్షికోత్సవం



పెదకాకాని: వెనిగండ్ల శివారు అగతవరప్పాడు రోడ్డులో జన చైతన్య సంస్థ ఆధ్వర్యంలోని షిర్డీ సాయిబాబా మందిరం 25వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. వేడుకల్లో మందిర చైర్మన్ మాదాల రత్నగిరిబాబు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీ హోమం నిర్వహించారు. తొలుత శ్రీ షిర్డీ సాయి నాథుడిని పల్లకీలో ఉంచి నగర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో జన చైతన్య సంస్థల అధినేత్రి మాదాల శకుంతలమ్మ, కుటుంబ సభ్యులు, ఆలయ అర్చకులు కూరపాటి శివప్రసాద్, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అలరించిన వీణా నాదార్చన

పాత గుంటూరు: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా స్తంభాలగరువు శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం అభిషేకం, విశేష పూజలు జరిపారు. రాత్రి పుష్పాభిషేకం నిర్వహిస్తుండగా, శ్రీ భారతీ సంగీత నిలయం వ్యవస్థాపకులు, వీణాగాన ప్రపూర్ణ ఏ. భారతీదేవి శిష్య బృందం కె. నాగలక్ష్మి, భవాని, సాయిలక్ష్మి వీణా నాదార్చన చేశారు. మహాగణపతిం కీర్తనతో ప్రారంభించి మరుగేలరా ఓ రాఘవ, వినవయ్య రామా అంటూ అనేక కీర్తనల్ని వీనుల విందుగా పలికించారు. వీరికి మృదంగంపై జగన్మోహిని చక్కని వాయిద్య సహకారాన్ని అందించారు.